


స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక




| వరంగల్ | సంపుటి : 02 | సంచిక : 97 | ఎడిటర్ : డి.శివకృష్ణ | శుక్రవారం | 23-10-2026 | పేజీలు : 04 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|---|
| WARANGAL | VOL : 02 | ISSUE : 97 | EDITOR : D.SHIVAKRISHNA | FRIDAY | 23-10-2026 | PAGES : 04 | PRICE : 2/- |

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts

# అవసరమైతే బీసీ లెక్కలు సవరిస్తాం..

## కులగణన లెక్కలపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు




**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసాన్ని తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను తేల్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న లెక్కల్లో ఎవరైనా తమ వివరాలు నమోదు కాలేదని భావిస్తే, వాటిని సవరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అవసరమైతే బీసీ కులగణన లెక్కలను సరిచేసి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని ప్రకటించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. ఏ కులం వారికైనా తమ జనాభా లెక్కల్లో తక్కువగా నమోదైందని భావిస్తే, సంబంధిత వివరాలు (మిగతా 2లో..)

# ఇన్‌స్టాగ్రామ్‌లోకి సోనియా గాంధీ ఎంట్రీ..

## ఆత్మకథ Belonging ఫస్ట్ లుక్ విడుదల




**ఢిల్లీ:**

కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లోకి అడుగుపెట్టారు. తొలి పోస్ట్‌లోనే 'దీవ-శ్రీశీఅస్త్రఱఅస్త్ర: ా జీశీబతీఅవఎ శీట ాశీజవ' పేరుతో రూపొందిన తన ఆత్మకథ ఫస్ట్ లుక్‌ను ఆమె పంచుకున్నారు. తన జీవితంలోని ప్రేమ, కర్తవ్యం, విషాదాలు, తనకంటూ ఒక స్థానం కోసం సాగిన అన్వేషణ వంటి అంశాలను ఈ పుస్తకంలో వివరించినట్లు సోనియా గాంధీ తెలిపారు. తన ఆత్మకథను పాఠకులతో పంచుకోవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పుస్తకాన్ని నవంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

### తొలి ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌గా..

పుస్తకం తొలి ప్రతులను అందుకున్న సోనియా గాంధీ, తన కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రాతో కలిసి వాటిని పరిశీలించారు. పుస్తకంలో అనేక ఫొటోలు ఉన్నాయని ఆమె ప్రియాంకతో చెప్పడం వీడియోలో కనిపిస్తుంది. అనంతరం ప్రియాంక తన తల్లికి స్వీట్లు తినిపించగా.. ఇద్దరూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ వీడియోను సోనియా గాంధీ తన తొలి ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌గా పంచుకున్నారు. (మిగతా 2లో..)

# డ్రైవింగ్ లైసెన్స్ పాస్‌మార్కులు పెంపు..

## కేంద్రం కొత్త ప్రతిపాదనలు




**ఢిల్లీ:**

కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాల నిబంధనలు 1989కి సంబంధించి తీసుకొచ్చిన ముసాయిదా సవరణల ప్రకారం.. డ్రైవింగ్ లైసెన్స్‌లో అడ్రస్ మార్పు ప్రక్రియను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రతిపాదించింది. అంతేకాకుండా.. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోగా రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ అధికారులు సదరు విన్నపాన్ని ఆమోదించకపోతే లేదా తిరస్కరించకపోతే.. ఆ రిక్వెస్ట్ ఆటోమేటిక్‌గా ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తారు. డ్రైవింగ్ లైసెన్స్ సేవలను మరింత (మిగతా 2లో..)

# ఆలోచించి సాగు చేయండి..

## అవగాహన లేకుండా పంటలు వేసి నష్టపోవద్దు

## రైతాంగానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

నేల తల్లిని సంరక్షించుకుంటేనే భవిష్యత్ తరాలకు ఆహార భద్రత కల్పించగలమని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోకుండా వ్యవసాయంలో ఆశించిన దిగుబడులు సాధించడం సాధ్యం కాదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నేల సారాన్ని పరిరక్షించడం, పంట భూములను సంరక్షించడం, ప్రకృతి వనరులను సమర్థవంతంగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమంతో పాటు భవిష్యత్ వ్యవసాయాన్ని దృష్టిలో పెట్టుకొని భూసార పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని స్పష్టం చేశారు. గురువారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఖేత్ బచావో అభియాన్' (సాగు భూమి సంరక్షణ) కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ భూముల పరిరక్షణ, భూసార పరీక్షలు, నీటి పొదుపు, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక, సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, పంట వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై రైతులకు కీలక సూచనలు చేశారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన భూములను అందించాలంటే వ్యవసాయ పద్ధతుల్లో శాస్త్రీయ మార్పులు తీసుకురావాల్సిన (మిగతా 2లో..)

# కాంగ్రెస్‌కు మరో 30 ఏళ్లు అధికారం లేనట్టే..

## కాంగ్రెస్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర వ్యాఖ్యలు



**ఢిల్లీ:**

రాబోయే 30 ఏళ్ల వరకు కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. నిరసనల వల్ల రాహుల్ గాంధీ సాధించేది ఏమీ ఉండదని పేర్కొన్నారు. (మిగతా 2లో..)

# ఐక్యతే దేశానికి బలం

## 2047 నాటికి వికసిత్ భారత్‌ను నిర్మించాలి

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

దేశ ప్రజలందరికీ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అలాయ్ బలాయ్, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో దసరా పండుగ సందర్భంగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నిర్వహించే సంప్రదాయ 'అలయ్ బలయ్' కార్యక్రమంలో వెంకయ్య నాయుడు పాల్గొని మాట్లాడారు. ఆకలి, దప్పులు లేని సమాజాన్ని నిర్మించడంతో పాటు అవినీతికి, అఘాయిత్యాలకు తావులేని దేశంగా భారత్‌ను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. గతంలో భారతీయుల మధ్య ఉన్న విభేదాలను బ్రిటిష్ పాలకులు తమకు అనుకూలంగా మలుచుకుని దేశాన్ని పాలించారని, ఆ క్రమంలో మన సంస్కృతి, సంప్రదాయాలను దెబ్బతీశారని గుర్తుచేశారు. అందువల్ల ప్రజల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మనుషుల మధ్య ప్రేమను పంచుతూ, ఆత్మీయ అనుబంధాలను బలోపేతం చేసే గొప్ప వేదిక అలాయ్ బలాయ్ అని అన్నారు. (మిగతా 2లో..)

# 'కేటీఆర్ గడ్డం పెంచితే సీఎం అవుతారా?'..

## ఎంపీ అర్వింద్ సెటైర్లు



**స్టార్ త్రినేత్రం, నిజామాబాద్:**

తెలంగాణలోబీజేపీ పార్టీ సైలెంట్ అయిందన్న ప్రచారంపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ సైలెంట్ కాలేదని.. 2028 ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమని అన్నారు. తెలంగాణలో ప్రభంజనం సృష్టించేందుకు బ్యాక్ గ్రౌండ్?లో పనులంతా జరుగుతున్నాయని.. కాంగ్రెస్‌కు ఓటేసే పరిస్థితి తెలంగాణలో లేదని వచ్చే ఎన్నికలు బీఆర్ఎస్‌కు అంత సులభమేమి కాదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీతో (మిగతా 3లో..)

# నేడు దక్షిణాది డీజీపీల సమన్వయ భేటీ

## ఐసీసీసీ వేదికగా ఉగ్రవాదం, డ్రగ్స్, సైబర్ నేరాల కట్టడికి ఉమ్మడి వ్యూహం

## సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

## పోలీసింగ్‌లో కృత్రిమ మేధ వినియోగంపై కీలక చర్చ: డీజీపీ సీవీ ఆనంద్




**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

దక్షిణాది రాష్ట్రాల మధ్య పోలీసుల సమన్వయాన్ని మరింత పటిష్టం చేసి, అంతర్రాష్ట్ర నేరాలకు చెక్ పెట్టే లక్ష్యంతో హైదరాబాద్ వేదికగా నేడు (శుక్రవారం) అత్యున్నత స్థాయి పోలీసు సమన్వయ కమిటీ సమావేశం జరగనుంది. తెలంగాణ పోలీసు శాఖ ఆతిథ్యమిస్తున్న ఈ ప్రాంతీయ సదస్సుకు బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వేదిక కానుంది. ఈ భేటీకి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేయనున్నారని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సరిహద్దులు దాటి విస్తరిస్తున్న నేరాలను సమర్థంగా అరికట్టడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్ వంటి కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన డీజీపీలు, ఐజీలు పాల్గొంటారు. వీరితో పాటే కేంద్ర నిఘా, భద్రత, దర్యాప్తు సంస్థలైన ఇంటెలిజెన్స్ బ్యూరో, సీబీఐ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్,ఎన్ఐఏ, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ విభాగాల ఉన్నతాధికారులు సైతం హాజరుకానున్నారు. ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలీసు శాఖలు అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలు, సమన్వయంతో నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై వీరంతా చర్చించనున్నారు. (మిగతా 2లో..)

# ఐక్యతే దేశానికి బలం

(మొదటి పేజీ తరువాయి)

మానవత్వాన్ని ముందుకు తీసుకెళ్లే ఇలాంటి కార్యక్రమాల ద్వారా మన మధ్య ఉన్న అనుబంధాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. దేశానికి, సమాజానికి అన్నింటికంటే ముఖ్యమైనది ఐక్యత అని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. భారతీయులందరూ భిన్నత్వాన్ని గౌరవిస్తూ సమైక్యంగా ఉండాలని, ప్రకృతితో మమేకమై జీవించే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. దేశాభివృద్ధితో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, భాషలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ముఖ్యంగా మాతృభాష తెలుగును పరిరక్షించాలని పిలుపునిచ్చారు. మాతృభాష మన కంటి చూపు లాంటిదని, దానిని నిర్లక్ష్యం చేయకుండా భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాలని అన్నారు. పరస్పర కలహాలకు దూరంగా ఉంటూ ప్రేమ, ఆప్యాయత, మానవత్వంతో ముందుకు సాగినప్పుడే అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు.

# కాంగ్రెస్‌కు మరో 30 ఏళ్లు అధికారం లేనట్టే..

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీలో నిర్వహించిన యమునా నది పునరుద్ధరణ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గురువారం పాల్గొని మాట్లాడారు. బీజేపీకి చెందిన సామాన్య బూత్ స్థాయి కార్యకర్త నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వరకు అందరూ నిరంతరం ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 'ఓట్ చోరీ' ఆరోపణల ముసుగులో రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు దేశంలో ఉన్న అక్రమ చొరబాటుదారులను కాపాడేందుకు, వారి ఓటు హక్కును పరిరక్షించేందుకు ప్రయత్నిస్తున్నారని దేశ ప్రజలంతా గ్రహించారని విమర్శించారు. కోర్టు తీర్పులు తమకు అనుకూలంగా వస్తే న్యాయమని, వ్యతిరేకంగా వస్తే న్యాయ వ్యవస్థనే ప్రశ్నించడం రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. గత 30 ఏళ్లలో ఢిల్లీని పాలించిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు యమునా నదిని మురుగుకు నిలయంగా మార్చేశాయని, రోజూ వేల టన్నుల వ్యర్థాలను నదిలోకి వదిలిపెట్టాయని ఆరోపించారు. ప్రస్తుతం ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ 2029 నాటికి యమునా నదిని సంపూర్ణంగా ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. పంజాబ్‌లో ఆప్ పాలనలో మాదకద్రవ్యాల వ్యాపారం విపరీతంగా పెరిగిపోయిందని.. 2029 నాటికి అక్కడ డ్రగ్స్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేస్తామని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

# నేడు దక్షిణాది డీజీపీల సమన్వయ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సదస్సులో ప్రధానంగా ఉగ్రవాదం, మావోయిస్టుల ప్రాబల్యం తగ్గిన అనంతర పరిస్థితులు, గంజాయి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర సైబర్ నేరాలు, ఆర్థిక, వ్యవస్థీకృత నేరాలు, మానవ అక్రమ రవాణాతో పాటు యువత నిరసనల వంటి కీలక అంశాలపై ఉమ్మడి కార్యాచరణను రూపొందించనున్నారు. ముఖ్యంగా అంతర్రాష్ట్ర నేరగాళ్ల ముఠాల కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టడం, నేరగాళ్ల సమాచారాన్ని రాష్ట్రాల మధ్య వేగంగా పంచుకోవడం, దర్యాప్తులో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించే మార్గాలపై ఈ సమావేశంలో సమీక్షిస్తారు. అలాగే దేశవ్యాప్తంగా ఇటీవల అమల్లోకి వచ్చిన మూడు నూతన క్రిమినల్ చట్టాల అమలు తీరు, సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతాల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై కూడా చర్చించనున్నారు. నేరగాళ్లు ఆధునిక సాంకేతికతను వాడుకుంటున్న నేపథ్యంలో.. దర్యాప్తును మరింత వేగవంతం చేసేందుకు స్మార్ట్ పోలీసింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ వినియోగంపైనా ఉన్నతాధికారులు తమ అనుభవాలను, ఆలోచనలను పంచుకోనున్నారు. దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు ఒకే వేదికపైకి వచ్చి ఇలా సమన్వయంతో పనిచేస్తే సరిహద్దులు దాటుతున్న నేరాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

# అవసరమైతే బీసీ లెక్కలు సవరిస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేయిస్తామని తెలిపారు. నాకు అవకాశం ఉంటే నా కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నది నా ఆలోచన అన్నారు.

### ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చే అంశంపై కీలక వ్యాఖ్యలు

ముదిరాజ్‌లను ప్రస్తుతం ఉన్న బీసీ–డీ జాబితా నుంచి బీసీ–ఏ జాబితాలోకి మార్చాలన్న డిమాండ్‌పై ముఖ్యమంత్రి స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నేతలు న్యాయ నిపుణులను సంప్రదించి, ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అదే సమయంలో గంగపుత్రులలో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ బిడ్డలకు అనేక అవకాశాలు కల్పించామని రేవంత్ రెడ్డి తెలిపారు. మిగతా ముదిరాజ్ నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని చెప్పారు.

### ఫామ్ హౌస్‌లో పడుకోను.. వయసు, ఓపిక ఉన్నాయ్..

తన పనితీరుపై మాట్లాడుతూ పరోక్షంగా కేసీఆర్?పై విమర్శలు గుప్పించారు. నాకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని నేను ఫామ్ హౌస్‌లో పడుకునే రకాన్ని కాదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు ఇచ్చామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలోనే సముచిత అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి అధికారికంగా నిర్వహిస్తాం పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. వారి సేవలను స్మరించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, తమ ప్రభుత్వం కొత్తగా మరిన్ని పథకాలను అమలు చేస్తోందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# ఇన్‌స్టాగ్రామ్‌లోకి సోనియా గాంధీ ఎంట్రీ..




(మొదటి పేజీ తరువాయి)

### ఇటలీ బాల్యం నుంచి భారత రాజకీయాల వరకు..

ఈ ఆత్మకథలో సోనియా గాంధీ జీవితంలోని వ్యక్తిగత, రాజకీయ అంశాలను వివరించారు. యుద్ధానంతర ఇటలీలో ఆమె బాల్యం, రాజీవ్ గాంధీతో పరిచయం, వివాహం తర్వాత భారత్‌కు రావడం, నెహ్రూ–గాంధీ కుటుంబంతో ఆమె జీవితం వంటి అంశాలు పొందుపరిచారు. అలాగే, 1984లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ హత్య, 1991లో రాజీవ్ గాంధీ హత్యతో ఆమె జీవితంలో చోటుచేసుకున్న కీలక పరిణామాలనూ ప్రస్తావించారు. ఆ విషాద ఘటనల తర్వాత సోనియా గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించిన తీరు, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ఆమె పోషించిన పాత్ర గురించీ వివరించారు.

### ప్రచురణ సంస్థ మార్పు

ఈ ఆత్మకథను తొలుత ప్రచురించాల్సిన పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఆ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గింది. అనంతరం హార్పర్‌కాలిన్స్ ఇండియా ఈ పుస్తకాన్ని ప్రచురించేందుకు ముందుకొచ్చింది. కాగా, నవంబర్ 10న విడుదల కానున్న ఈ పుస్తకంపై రాజకీయ, సాహిత్య వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# ఆలోచించి సాగు చేయండి..

(మొదటి పేజీ తరువాయి)

అవసరం ఉందని పేర్కొన్నారు.

### ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం..

ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, ఋతుపవనాల తగ్గుదల, భూతాపం పెరుగుదల, వర్షపాతం అసమానతలు, వర్షాలు సకాలంలో కురవకపోవడం వంటి పరిస్థితులు వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల సాగులో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూమి స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులను అవసరానికి మించి వినియోగించకుండా వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన మోతాదుల్లోనే ఉపయోగించాలని మంత్రి స్పష్టం చేశారు. అధిక మోతాదుల్లో రసాయనాల వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావాలు పడే ప్రమాదం ఉందని తెలిపారు. పంటల్లో రసాయనాల అవశేషాలు పెరిగితే ఆహార నాణ్యత, భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను పాటిస్తూ, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ విధానాలను అనుసరించాలని సూచించారు.

### భూసార పరీక్షలు తప్పనిసరి..

ప్రతి రైతు తప్పనిసరిగా తన వ్యవసాయ భూమికి భూసార పరీక్షలు చేయించుకోవాలని మంత్రి కోరారు. నేలలో ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకొని, ఏ పంటకు ఎలాంటి ఎరువులు ఎంత మోతాదులో అవసరమో నిర్ధారించుకున్న తర్వాతే వాటిని వినియోగించాలని సూచించారు. దీనివల్ల అనవసరమైన ఎరువుల ఖర్చును తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి గ్రామం, ప్రతి రైతు భూమికి సంబంధించిన భూసార పరీక్షల వివరాలను క్రమబద్ధంగా నమోదు చేసి, రికార్డులను నిర్వహించాలని ఆదేశించారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులకు అవసరమైన సలహాలు అందించాలని, నేల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించే విధానాన్ని బలోపేతం చేయాలని సూచించారు. రైతులను సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించడంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు కీలక పాత్ర పోషించాలని మంత్రి పేర్కొన్నారు. సేంద్రీయ పద్ధతులు, జీవ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, పంట మార్పిడి వంటి విధానాల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కేవలం సూచనలు ఇవ్వడమే కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడే ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేసి, తక్కువ పెట్టుబడితో స్థిరమైన దిగుబడులు సాధించేలా మార్గనిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు.

### రైతులకు మెరుగైన ఆదాయం..

భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గిపోతున్న నేపథ్యంలో నీటి వినియోగంలో రైతులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి అన్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ, తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని, నీటి ప్రతి చుక్కను సమర్థవంతంగా వినియోగించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సాగునీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో భూమి రకం, నీటి వసతి, స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి రెండు మూడు తడులతో పండే స్వల్పకాలిక పంటలు, అపరాల పంటలను సాగు చేసుకునేలా రైతులకు సలహాలు ఇవ్వాలని సూచించారు. రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించే దిశగా పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. సంప్రదాయ పంటలతో పాటు ప్రాంతానికి అనుకూలమైన ఉద్యాన పంటలను సాగు చేసే అవకాశాలను రైతులకు వివరించాలని సూచించారు. రైతులు పెట్టుబడి వ్యయం తగ్గించడం, నీటిని ఆదా చేయడం, పంటకు మార్కెట్‌లో లభించే ధర, నికర ఆదాయం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయం చేయాలని సూచించారు.

### వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలి..

వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకునే చర్యలు చేపట్టాలని మంత్రి తెలిపారు. వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకొని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని, పొలాల్లోకి నీరు ఇంకేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, నేల కోత నివారణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వాగుల్లో ఇసుకను అధికంగా తీయడం వల్ల నీటి నిల్వలు, భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటూ, సహజ నీటి వనరులను సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. పంట కోతల అనంతరం మిగిలే వ్యర్థాలను కాల్చివేయడం వల్ల నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులకు నష్టం కలగడంతో పాటు గాలి కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని మంత్రి తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చకుండా వాటిని మల్చింగ్‌కు వినియోగించాలని, నేలలో తేమ నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట వ్యర్థాలను సక్రమంగా వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు పశుపోషణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు అవసరమైన పశుగ్రాసం పెంపకాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. పంట అవశేషాలను పశుగ్రాసంగా ఉపయోగించుకునే అవకాశాలను కూడా రైతులు పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణను విస్తృతంగా వినియోగించడం ద్వారా రైతుల శ్రమ, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించవచ్చని మంత్రి అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద అర్హులైన రైతులతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఎఫ్‌పీఓలు) కూడా వ్యవసాయ పనిముట్లు అందిస్తామని తెలిపారు. ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు సమూహాల ద్వారా వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి తీసుకురావడం వల్ల సాగు పనులు సకాలంలో పూర్తి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఖేత్ బచావో అభియాన్‌ను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, వ్యవసాయ భూముల పరిరక్షణకు నిరంతరం కొనసాగాల్సిన ఉద్యమంగా తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారులు మండలాల వారీగా కార్యాచరణ రూపొందించి, గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రీయ సాంకేతిక సలహాలు అందిస్తూ, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులను అవలంబించేలా ప్రోత్సహించాలని తెలిపారు. నేల ఆరోగ్యం, నీటి సంరక్షణ, పంటల వైవిధ్యీకరణ, సేంద్రీయ వ్యవసాయం, పంట వ్యర్థాల సమర్థ వినియోగం వంటి అంశాలపై రైతుల్లో అవగాహన పెంపొందించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత స్థిరమైన, లాభదాయకమైన రంగంగా తీర్చిదిద్దవచ్చని మంత్రి పేర్కొన్నారు. రైతులు ప్రకృతి వనరులను కాపాడుకుంటూ, శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ తెలివిగా వ్యవసాయం చేయాలని సూచించారు. వ్యవసాయ భూములను సంరక్షించడం, నేల సారాన్ని పెంపొందించడం, నీటి వనరులను కాపాడుకోవడం వంటి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఖేత్ బచావో అభియాన్‌ను విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# డ్రైవింగ్ లైసెన్స్ పాస్‌మార్కులు పెంపు..

(మొదటి పేజీ తరువాయి)

సరళీకృతం చేయడం, దరఖాస్తుల పరిశీలన సమయాన్ని వేగవంతం చేసేందుకు గాను ఈ మార్పులను ప్రతిపాదించినట్లు కేంద్ర రవాణా శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం లైసెన్స్‌లో పేరు లేదా ఇతర వివరాల సవరణకు వసూలు చేస్తున్న రూ.200 ఫీజును కూడా పూర్తిగా రద్దు చేయాలని ప్రతిపాదించారు. కొత్తగా ప్రతిపాదించిన నిబంధన 16ఏ ప్రకారం.. డ్రైవింగ్ లైసెన్స్ వివరాల మార్పుల కోసం వచ్చే దరఖాస్తులను 15 రోజుల్లోగా అధికారులు ఆమోదించాల్సి ఉంటుంది లేదా తిరస్కరించాల్సి ఉంటుంది. ఒకవేళ దరఖాస్తును తిరస్కరిస్తే.. దానికి గల బలమైన కారణాలను లేఖ ద్వారా లేదా డిజిటల్ మాధ్యమాల ద్వారా అభ్యర్థికి స్పష్టంగా తెలియజేయాల్సి ఉంటుంది. అడ్రస్ మార్పు కోరే అభ్యర్థులకు మాత్రం ప్రత్యేకంగా 30 రోజుల గడువును నిర్దేశించారు. 30 రోజుల్లోగా అధికారులు ఎలాంటి చర్య తీసుకోకపోతే, ఆ అభ్యర్థన ఆమోదించబడినట్లే అవుతుంది. ఈ 'ఆటోమేటిక్ ఆమోదం' నిబంధన కేవలం అడ్రస్ మార్పునకు మాత్రమే వర్తిస్తుందని, ఇతర సవరణలకు వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. అంతేగాకుండా ఇకపై డ్రైవింగ్ టెస్టులో 75 శాతం మార్కులు దాటితేనే లైసెన్స్ వచ్చేలా కొత్త ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ముసాయిదా నిబంధనల ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్‌లో పేరు, మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీ లేదా అడ్రస్ మార్పులకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఆధార్ ఆన్‌లైన్ నిర్ధారణ ద్వారా పొందే సేవలకు కూడా రుసుములను మినహాయించాలని ప్రతిపాదించారు. దీనితో పాటు వాహనదారులకు కూడా పెద్ద ఊరట లభించనుంది. వాహన రిజిస్ట్రేషన్ పత్రాల్లో చిరునామా మార్పు నమోదుకు అయ్యే రుసుమును రద్దు చేయాలని, అలాగే వాహన చిరునామా మార్పు కోసం సమర్పించే నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ దాఖలు చేయడంలో ఆలస్యమైతే విధించే అదనపు రుసుములను తొలగించాలని భావిస్తున్నారు.




ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం ఆలస్యమైన ప్రతి నెలకు ద్విచక్ర వాహనాలకైతే రూ.300, ఇతర వాహనాలకైతే రూ.500 అదనంగా వసూలు చేస్తున్నారు. నూతన విధానంలో డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్, నకిలీ లైసెన్స్ జారీ, కొత్త వాహన కేటగిరీ జోడింపు, వ్యక్తిగత వివరాల సవరణ కోసం 'ఫారమ్ 2ఏ' అనే కొత్త దరఖాస్తు విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అవసరమైన పత్రాలను సమర్పించి, ఈ–సిగ్నేచర్ లేదా ఇతర డిజిటల్ విధానాల ద్వారా తమ గుర్తింపును ధృవీకరించుకోవాల్సి ఉంటుంది. సారథి పోర్టల్‌లో ఇదివరకే అందుబాటులో ఉన్న వివరాలను ఆటోమేటిక్‌గా నమోదు చేసుకునేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు. కాగా.. ఈ నిబంధనలు ప్రస్తుతం ప్రతిపాదనల దశలోనే ఉన్నాయని, గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుండి 30 రోజుల పాటు ప్రజాభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం ప్రభుత్వం వీటిని ఖరారు చేస్తుందని వెల్లడించారు.

# అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవ సంస్థ ఆధ్వర్యంలో 851వ రోజు అన్నదానం



**స్టార్ త్రినేత్రం, వేములవాడ :**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దక్షణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిత్యం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా 851 రోజు ఖమ్మం వెంకటయ్య జ్ఞాపకర్థం వారి కుటుంబ సభ్యులు అందించిన సహాయంతో, శాశ్వత దాతలు నాగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు భాను ఏజెన్సీస్ వారి సంవత్సర దాతలు తోట లక్ష్మి, సహకారాలతో ఈ రోజు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న పట్టణ పరిసర ప్రాంతాలలో ఉన్న అన్నార్తులకు, యాచకులకు భోజనం ప్యాకెట్లు అందించడం జరిగిందని అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవ సంస్థ నిర్వాహకులు తోట లహరి అన్నారు, అనంతరం వారు మాట్లాడుతూ ట్రస్ట్ తరుపున నిర్వహిస్తున్న సేవ కార్యక్రమాలకు గానూ మీ వంతు సహాయ సహకారాలు అందించాలనుకునేవారు ట్రస్టు నెంబర్ 8919376459,ను సంప్రదించాల్సిశీదిగా కోరారు, ఇట్టి సేవ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు తోట లహరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# 'కేటీఆర్ గడ్డం పెంచితే సీఎం అవుతారా?'..

(మొదటి పేజీ తరువాయి)
పొత్తులేకుండా బీజేపీ గెలవడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. గురువారం నిజామాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన అర్వింద్.. కాంగ్రెస్-బీఆర్ఎస్ నేతలు పరస్పరం కాపాడుకుంటున్నాయని దుయ్యబట్టారు.

**రేవంత్ రెడ్డిపై హైకమాండ్ అసంతృప్తి:**
తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పొత్తుకు చర్చకు కొనసాగుతున్నాయని అర్వింద్ ఆరోపించారు. ఈ రెండు పార్టీల పొత్తుకు రేవంత్ రెడ్డి ఒక్కరే అడ్డుగా ఉన్నారని అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద కాంగ్రెస్ హైకమాండ్ సంతృప్తితో లేదన్నారు. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పొత్తుతో రేవంత్ రెడ్డిని ఔట్ చేయవచ్చని చూస్తోందన్నారు. కాళేశ్వరం దోపిడీకి తప్ప ఎందుకూ పనికిరాలేదని బీఆర్ఎస్ దోపిడీ తెలిసి మళ్లీ ప్రజలు ఓటేస్తారా అని అర్వింద్ ప్రశ్నించారు. అధికారంలో ఉండగా లక్షల కోట్లు కాజేసిన బీఆర్ఎస్ తామే గొప్ప అన్నట్లు ఇప్పుడు సోషల్ మీడియాలో పెయిడ్ ప్రమోషన్లు చేయించుకుంటోందని ఆరోపించారు. త్వరలో తెలంగాణలో మొత్తం పత్రికలు, చానళ్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ కాషాయమయం కాబోతున్నాయని ఇందులో సంధించే ప్రశ్నలకు బీఆర్ఎస్ సమాధానాలు చెప్పాల్సి ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికలు బీఆర్ఎస్ కు అంత తేలికేమి కాదని బీఆర్ఎస్‌ను గాయాబ్ చేస్తామన్నారు. కాంగ్రెస్ ను ఎవరు గాయాబ్ చేయనవసరం లేదని ఆపార్టీనే గాయాబ్ అవుతుందన్నారు.

**కేటీఆర్ గడ్డంకు రీజన్ ఇదే:**
గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతావని ఎవరో చెబితే కేటీఆర్ గడ్డం పెంచుకుంటున్నారని సెటైర్ వేశారు. గతంలో కేసీఆర్ పాత సెక్రటేరియట్‌కు వెళ్తే గెలవనని చెపితే కొత్త సెక్రటేరియట్ నిర్మించాడని అయినా గెలవలేక పోయాడని అన్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం గడ్డాలు పెంచుకోవడం కేటీఆర్ తొలివ్యక్తి కాదని గతంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా గడ్డం పెంచుకున్నారని అయితే ఆయన గడ్డం పెరిగింది తప్పా కాంగ్రెస్ పార్టీ పెరగలేకపోయిందని ఎద్దేవా చేశారు. కేటీఆర్?కు కూడా గడ్డం పెరుగుతుంది తప్ప ముఖ్యమంత్రి అయ్యేది లేదన్నారు.

# ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

## పండుగ సాయన్న ఆశయాలను కొనసాగిద్దాం

## తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు పిట్టల భాస్కర్ ముదిరాజ్



**స్టార్ త్రినేత్రం, వర్ధన్నపేట:**
వర్ధన్నపేట మండలంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన మహావీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలను గురువారం కుల బంధువులు, సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఇల్లంద గ్రామం గాంధీ సెంటర్‌తో పాటు వర్ధన్నపేట మండల కేంద్రంలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, అంబేద్కర్ సెంటర్‌లో ఈ వేడుకలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో పండుగ సాయన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సాయన్న చిత్రపటానికి పాలతో అభిషేకం చేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఇల్లంద గ్రామంలో జరిగిన వేడుకలకు తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు సంగినేని బీంరాజ్ ముదిరాజ్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పిట్టల భాస్కర్ ముదిరాజ్, కార్యదర్శి పొన్నం స్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వర్ధన్నపేటలో జరిగిన కార్యక్రమానికి మండల అధ్యక్షుడు పిట్టల భాస్కర్ ముదిరాజ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పండుగ సాయన్న తెనుగ (ముదిరాజ్) సామాజిక వర్గానికి చెందిన ధైర్యసాహసాలు కలిగిన పోరాట యోధుడని పేర్కొన్నారు. ఆయన తన జీవితాన్ని అణగారిన ప్రజల హక్కుల కోసం, పెత్తందారులు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడేందుకు అంకితం చేశారని వివరించారు. పాలమూరు జిల్లా నవాబ్ పేటలోని మిరిగోన్ గ్రామంలో అనంతయ్య, సాయమ్మ దంపతులకు సాయన్న జన్మించారని తెలిపారు. నాటి సమాజంలో పెత్తందారులు, భూస్వాముల చేతుల్లో అణచివేతకు గురైన ప్రజలకు అండగా నిలిచేందుకు ఆయన ఒక దళాన్ని ఏర్పాటు చేసి అనేక పోరాటాలు సాగించారని గుర్తుచేశారు. నిజాం పాలనలో పెత్తందారులు, భూస్వాములు ఏకమై సాయన్న భూములను స్వాధీనం చేసుకుని, ఆయనపై బందిపోటు ముద్ర వేసి ఉగ్రవాదిగా చిత్రీకరించారని నాయకులు వివరించారు. నాటి పోలీసులు తప్పుడు కేసులు పెట్టి, సాయన్నను ఒక గుట్టపైకి తీసుకెళ్లి దారుణంగా హత్య చేశారని, ఆయన తలను ఒకచోట, మొండెన్ని మరోచోట పడవేసి కిరాతకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గం కోసం, పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన మహావీరుడిగా పండుగ సాయన్న చరిత్రలో నిలిచిపోయారని నాయకులు కొనియాడారు. ఆయన తమ సామాజిక వర్గంలో జన్మించడం గర్వకారణమని పేర్కొంటూ, సాయన్న ఆశయాలను కొనసాగించేందుకు కుల బంధువులందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయన జీవన విధానం, ప్రజల కోసం చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. సంఘం ఐక్యతను బలోపేతం చేసుకుంటూ, సామాజిక అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఇల్లంద గ్రామంలోని గాంధీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కుల పెద్దలు పిట్టల కుమారస్వామి, మట్టపల్లి సుభాష్, పెద్దమ్మతల్లి పరపతి సంఘం అధ్యక్షుడు పిట్టల రాజు, మత్స్యశాఖ ఉపాధ్యక్షుడు కుమ్మం రాములు, కార్యదర్శి కొండ ఉపయోగం, డైరెక్టర్లు సుంకరి ప్రశాంత్, మట్టపల్లి సురేష్, పిట్టల శివ, చెన్నబోయిన యాకయ్య, ముద్రబోయిన సాంబరాజు, బుస్స ఎల్లస్వామి, అనుమాస ప్రేమ్ ప్రసాద్, మాజీ కమిటీ సభ్యులు సుంకరి స్వామి, సుంకరి బిక్షపతి, కుల సభ్యులు వీరస్వామి, పండుగ బాబు, నిమ్మనబోయిన పైడి, కోలిపాక లింగయ్య, బచ్చల స్వామి తదితరులు పాల్గొన్నారు. వర్ధన్నపేట మండల కేంద్రంలో జరిగిన జయంతి వేడుకల్లో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు సంగినేని బీంరాజ్, మండల ఉపాధ్యక్షుడు నారెల్లి సుధాకర్, శ్రీనివాస్, మండల కార్యదర్శి పొన్నం స్వామి, బచ్చల స్వామి, మండల యువజన విభాగం అధ్యక్షుడు కుక్కల రాకేష్, ఉపాధ్యక్షుడు బాతు సతీష్, కార్యదర్శి ముద్రబోయిన సాంబరాజు, వర్ధన్నపేట సొసైటీ అధ్యక్షుడు భూమా సుధాకర్, కుల పెద్దమనిషి నారెల్లి సుధాకర్, భూమా శ్రీను, ఎద్దు వెంకటేశ్వర్లు, సొసైటీ సభ్యుడు బొల్లు శ్రీను, బోనాల వెంకన్న, నారెల్లి సురేష్, సాయన్న తదితరులు పాల్గొన్నారు. పండుగ సాయన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ సామాజిక ఐక్యతతో పనిచేస్తామని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు




**స్టార్ త్రినేత్రం, వరంగల్:**
వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. 1860--1900 మధ్య కాలానికి చెందిన పండుగ సాయన్న దానధర్మాలు, ధైర్యసాహసాలు, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలతో ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలు సమాజ అభివృద్ధికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. అదనపు కలెక్టర్ ఎల్.కిషోర్ కుమార్ గ్రామీణ క్రీడల్లో సాయన్న ప్రతిభను ప్రస్తావిస్తూ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. మేర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్రాజం అధికారికంగా జయంతి నిర్వహించడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎ.పుష్పలత, కె.శంకరయ్య, ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, పొన్నం రాజు ముదిరాజ్, నీరటి రాజు, ఇతర సంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి: కలెక్టర్ సత్య శారద




**స్టార్ త్రినేత్రం, వరంగల్:**
వరంగల్ జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహశీల్దార్లతో నిర్వహించిన సమీక్షలో రీసర్వే, భూదాన్ భూములు, భూభారతి, నక్షా, రెవెన్యూ సదస్సులు, సాదాబైనామా, భూసేకరణ, ఇన్నర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారి 163జీ, విమానాశ్రయం, ఎస్ఐఆర్, ఎమ్మెల్సీ తదితర అంశాల పురోగతిని సమీక్షించారు. ఆయా పనుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకుని, పరిష్కారం కాని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్.కిషోర్ కుమార్, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, సంబంధిత మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ముల్కనూర్‌లో పండుగ సాయన్న, కొమరం భీమ్ జయంతి వేడుకలు



**స్టార్ త్రినేత్రం, హనుమకొండ:**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్ నాయకత్వంలో ముల్కనూర్ అంబేద్కర్ కూడలిలో వీర యోధులు పండుగ సాయన్న, కొమరం భీమ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం వారు సాగించిన పోరాటాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రజల హక్కుల కోసం ధైర్యంగా నిలబడి, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన వారి జీవితాలు సమాజానికి మార్గదర్శకమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జక్కుల అనిల్ యాదవ్ మాట్లాడుతూ.. పండుగ సాయన్న, కొమరం భీమ్ పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ అణగారిన వర్గాలకు అండగా నిలవడం, ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం నేటి యువత బాధ్యత అని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ సమాన హక్కులు కలిగిన సమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉషాకోయిల ప్రకాష్, బొజ్జపురి అశోక్ ముఖర్జీ, ఆదరి రవీందర్, పొన్నాల మురళి, డబ్బా శంకర్, శ్రీరామోజు సమ్మయ్య, మాడుగుల గోపి, కాసగోని బాలకృష్ణ, తల్లా సదానందం, వెంకన్న, మాడుగుల కొమురయ్య, పూర్ణచందర్, వొల్లాల రమేష్, కిషోర్, తాకిల్ పాషా, పొన్నాల మధుసూదన్ రెడ్డి, కూన దేవరాజు, బొల్లంపల్లి షెడ్రక్, సదానందం, మొండయ్య, మాడుగుల యాదగిరి, సికా ప్రభాకర్, నాగరబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు. సర్పంచులు మేకల వెంకన్న, డప్పు శ్రీనివాస్, కాలేరు శ్రవణ్ హాజరయ్యారు. యువజన కాంగ్రెస్ నాయకులు పోగుల శ్రీకాంత్, గుడికందుల రాజు, మాడుగుల చింటూ, బొల్లంపల్లి రంజిత్, చిలుకూరి నితిన్, నిఖిల్, ఎల్దీ వినోద్, రాకేష్, అజయ్, రెనా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు ఆదరి స్వప్న, అన్నపూర్ణమ్మ, శోభతో పాటు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహనీయుల పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేస్తూ వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

# కోటలో ఘనంగా దుర్గామాత నవరాత్రుల ముగింపు వేడుకలు

## అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

## మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్



**స్టార్ త్రినేత్రం, వరంగల్:**
ఖిలా వరంగల్ తూర్పు కోటలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించి, బుధవారం రాత్రి వైభవంగా ముగింపు వేడుకలు జరిపారు. తూర్పు కోటలోని పోచమ్మ దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద పలు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించగా, చివరి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు సమర్పించారు. అనంతరం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ముగింపు వేడుకల్లో స్థానిక మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ దంపతులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోయ గిరిజనుల సంప్రదాయ దింసా నృత్యాలు, డప్పుల చప్పుళ్లు, సౌండ్ సిస్టం ఏర్పాట్లతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి ఉత్సాహాలతో ముగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రెండు దేవాలయాలకు సంబంధించిన ఉత్సవ కమిటీల సభ్యులు సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ మాట్లాడుతూ ఖిలా వరంగల్ తూర్పు కోటలో ప్రజలు భక్తిశ్రద్ధలతో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు. భక్తులు అమ్మవారి ఆశీస్సులతో ప్రశాంతమైన జీవితం గడపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రెండు ఉత్సవ కమిటీలకు చెందిన యువకులు, మహిళలు, భవాని మాలధారణ చేసిన భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తి పాటలు, డప్పుల మోతలు, సంప్రదాయ నృత్యాల నడుమ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. చివరగా దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించడంతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి.

# ప్రతి ఒక్కరూ తామే అభ్యర్థిగా భావించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పనిచేయాలి: మధుయాష్కి గౌడ్

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో పాల్గొన్న మధుయాష్కి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**
మహబూబ్ నగర్– రంగారెడ్డి– హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి గురువారం శంషాబాద్ లోని మల్లికా కన్వెన్షన్ లో నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పాల్గొన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హ ముఖ్యఅతిథిగా హాజరు కాగా.. ఎంపీ మల్లు రవి, జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బలమూరు వెంకట్ , ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి, ఆయా నియోజకవర్గాల ఇన్చార్జిలు, కార్పొరేషన్ చైర్మన్లు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ అభ్యర్థి రామ్మోహన్ రెడ్డిని గెలిపించేందుకు ఓటర్ నమోదును విస్తృతంగా చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుతో పాటు పలువురు నాయకులు సూచించారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్ నగర్ –రంగారెడ్డి– హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవాల్సిన అవసరం ఉందని.. ఇందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా యువకుడైన సామ రామ్మోహన్ రెడ్డిని పార్టీ నియమించిన నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణతో... ప్రతి ఒక్కరూ తామే అభ్యర్థిగా పని చేయాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీని కాంగ్రెస్ పార్టీ గెలవడం ద్వారా రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి వరిస్తుందని ఈ సందర్భంగా మధుయాష్కి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి అత్యధికంగా గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదును చేయించి.. తప్పకుండా గెలిపిస్తామని భరోసాని, విశ్వాసాన్ని సీఎంకి కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. కష్టపడిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్ పదవులను పార్టీ కేటాయిస్తుందని వివరించారు. ఎల్బీనగర్ కు చెందిన రామ్మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీగా అవకాశం రావడం సంతోషకరమని.. అతన్ని గెలిపించేందుకు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు విస్తృతంగా పనిచేయాలని సూచించారు.

# ట్యాంక్‌బండ్‌పై కొమురయ్య విగ్రహం అభినందనీయం..

## మామునూరు ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టాలి..
## బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గణం నర్సింహ్మా కురుమ

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నెలకొల్పుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గణం నర్సింహ్మా కురుమ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సానుకూల నిర్ణయాన్ని బహుజన ఆత్మగౌరవానికి దక్కిన గుర్తింపుగా పేర్కొంటూ, ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే క్రమంలో వరంగల్‌లో నిర్మిస్తున్న మామునూరు విమానాశ్రయానికి "దొడ్డి కొమురయ్య కురుమ" పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూస్వామ్య దోపిడీపై పోరాడి ప్రాణత్యాగం చేసిన కొమురయ్య పేరును ఎయిర్‌పోర్టుకు పెట్టడం ద్వారా యావత్ బీసీ, బహుజన సమాజానికి సముచిత గౌరవం లభిస్తుందన్నారు. ట్యాంక్‌బండ్‌పై విగ్రహ ఏర్పాటు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టే అంశంపై ప్రభుత్వం తక్షణమే అధికారిక నిర్ణయం తీసుకోవాలని కోరారు.



# సర్కారు బాయ్ చిత్ర బృందం

## ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగతో భేటీ

**స్టార్ట్ త్రినేత్రం, వరంగల్:**
వరంగల్ పట్టణంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ భేటీలో సర్కారు బాయి సినిమా దర్శకుడు లారా మరియు సైంటిఫిక్ స్టడీ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు చార్వాక పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు లారా మందకృష్ణ మాదిగకి సినిమా కథాంశాన్ని వివరించారు. 1980వ దశకంలో తెలంగాణలో ఉన్న సామాజిక, సాంఘిక వివక్ష నేపథ్యంలో ఈ చిత్ర నిర్మాణం జరుగుతోందని, డా. బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే వంటి మహనీయుల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని తెలిపారు. కేవలం సామాజిక సందేశంతోనే కాకుండా, ప్రేక్షకులందరికీ నచ్చేలా మంచి కమర్షియల్ అంశాలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామని వివరించారు. దీనిపై స్పందించిన మందకృష్ణ మాదిగ చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. వివక్షకు వ్యతిరేకంగా, సామాజిక చైతన్యాన్ని నింపే ఇలాంటి చిత్రాలు నేటి సమాజానికి అవసరమని, 'సర్కారు బాయి' చిత్రం గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షించారు.



# డిసెంబరులో హనుమకొండలో జాతీయ స్థాయి క్రీడా సంబరం

## దేశవ్యాప్తంగా అథ్లెట్ల రాక..
## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**స్టార్ త్రినేత్రం, హనుమకొండ:**
హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) మరో ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదిక కానుంది. డిసెంబరులో నిర్వహించనున్న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను సమకూర్చేందుకు చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి గురువారం జేఎన్ఎస్ స్టేడియాన్ని సందర్శించి, క్రీడా పోటీల నిర్వహణ కోసం చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేడియంలోని క్రీడా ప్రాంగణం, క్రీడాకారులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయి పోటీలకు హనుమకొండ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పోటీల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అథ్లెట్లు, కోచ్‌లు, సహాయక సిబ్బంది హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వసతి, పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా యువజన క్రీడల అధికారి కొత్త ప్రశాంత్‌కు సూచించారు. పోటీల సమయంలో క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. మరోవైపు స్టేడియంలో కొత్తగా నిర్మిస్తున్న మరుగుదొడ్లతోపాటు ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, క్రీడా పోటీలు ప్రారంభమయ్యేలోపు అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని స్పష్టం చేశారు. జాతీయ స్థాయి పోటీల నిర్వహణతో హనుమకొండకు క్రీడారంగంలో మరింత గుర్తింపు లభించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

# బంజారాహిల్స్‌లో కొమరం భీమ్‌కు ఘన నివాళులు

## తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో కొమరం భీమ్ జయంతి వేడుకలు




**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**
బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన వీర యోధుడు కొమరం భీమ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ, ఆత్మగౌరవం, స్వయం పాలన లక్ష్యంగా ఆయన సాగించిన పోరాటాన్ని స్మరించుకున్నారు. "జల్.. జంగల్.. జమీన్" నినాదంతో అడవి, భూమి, నీటిపై ఆదివాసీలకు హక్కులు ఉండాలని ఉద్యమించిన కొమరం భీమ్ జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆదివాసీల సామాజిక హక్కులు, గౌరవం, అభివృద్ధి కోసం ఆయన చేసిన పోరాటాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకులు ఎల్.రూప్ సింగ్, నవీన్ ఆచారి, సయ్యద్ ఇస్మాయిల్, లోకిని రాజు, పెందోర్ యశ్వంత్ రావు, కోరం గణేశ్, సెడమాకి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. కొమరం భీమ్ ఆశయాలను స్మరించుకుంటూ ఆయన చూపిన పోరాట మార్గం, ఆదివాసీ హక్కుల పరిరక్షణ పట్ల సమాజంలో మరింత అవగాహన పెంపొందించాలని నాయకులు ఆకాంక్షించారు.

# ఎల్‌నినో ప్రభావాలపై అప్రమత్తంగా ఉండాలి

## వివిధ శాఖలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి: కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**స్టార్ త్రినేత్రం, వరంగల్:**
ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, భూగర్భ జలాలు తదితర శాఖల క్షేత్రస్థాయి అధికారులతో పరిస్థితులను సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలు, సిద్ధం చేసుకోవాల్సిన కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు విద్యుత్ పొదుపుపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో ఆరుతడి పంటలు, బిందు సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి, పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) ఎల్.కిషోర్ కుమార్, (స్థానిక సంస్థలు) వై.వి.గణేష్, డీఆర్‌ఓ విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీఓ సుమ, నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మలతో పాటు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో లే-అవుట్ ప్రాంతాన్ని పరిశీలించిన గుండు సుధారాణి

## అభివృద్ధి పనుల పరిశీలనలో పాల్గొన్న కుడా అధికారులు

**స్టార్ త్రినేత్రం, వరంగల్:**
కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరులో చేపడుతున్న లే-అవుట్ ప్రాంతాన్ని కుడా చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జీడబ్ల్యూఎంసీ మాజీ మేయర్ గుండు సుధారాణి గురువారం సందర్శించి పరిశీలించారు. లే-అవుట్ అభివృద్ధికి సంబంధించిన ప్రాంతాన్ని పరిశీలిస్తూ అక్కడ చేపడుతున్న పనుల వివరాలను అధికారులతో తెలుసుకున్నారు. పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆమె ఈ పర్యటన చేపట్టారు. ఈ పర్యటనలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, ఏఈ భరత్ పాల్గొన్నారు. లే-అవుట్ ప్రాంతానికి సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com